


నేటి నుంచి సత్యాగ్రహ నిరసన

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాహుల్‌గాంధీ కక్ష పూరితంగా వ్యవహరిస్తూ అనర్హత వేటు వేసిన బిజెపి ప్రభుత్వ చర్యలకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి 8వరకు జై భారత్ సత్యాగ్రహ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కక్షపూరితమైన రాజకీయాలను చేస్తున్నారన్నారు. సామాన్య ప్రజలకు అందించవలసిన సంక్షేమ ఫలాలు పైనా, మోడీ అదానీ సంబంధాలు, అక్రమాస్తులపైనా ప్రశ్నిస్తున్నందుకు ఉద్దేశపూర్వకంగా కేసులు బనాయించి పార్లమెంట్‌లో అనర్హత వేటు వేయడాన్ని ఖండిస్తున్నా మన్నారు. ఈ చర్యలకు నిరసనగా గాంధీ, అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి డోల శ్రీనివాస్, జిల్లా మైనార్టీ సంఘం అధ్యక్షులు రెహమాన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జోనల్ సెక్రెటరీ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్‌పి నిధులు ఎగవేత

ఇప్పటి వరకు ఇచ్చింది రూ.7 కోట్లే ● కరోనా సాకుతో కాలం వెళ్లబుచ్చిన కేంద్రం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విభజన హామీలు నెరవేర్చకపోవడం, జిల్లాలో ఏర్పాటు చేసిన గిరిజన వర్సిటీ తదితరాలకు తగినన్ని నిధులు కేటాయించక పోవడం మాత్రమే కాదు, ఎంపీ నిధుల కేటాయింపులోనూ కేంద్ర ప్రభుత్వం జిల్లాపై వివక్ష చూపింది. కరోనా సాకుతో నాలుగుళ్లపాటు కాలక్షేపం చేసింది. నిబంధనల ప్రకారం ప్రతి పార్లమెంట్ సభ్యుడూ తన నియోజకవర్గం పరిధిలోని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఏటా రూ.5 కోట్లు చొప్పున కేటాయించాల్సివుంది. ఈలెక్కన విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు గత నాలుగేళ్లలో రూ.20 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి వుంది. తొలి ఏడాది 2019-20లో రూ.2.50కోట్ల చొప్పున రెండు దఫాలుగా మొత్తం రూ.5కోట్లు కేటాయించారు. కరోనా సాకుతో 2020-21లో రూ.2కోట్లు చొప్పున మాత్రమే ఇచ్చారు. ఆ తరువాత నుంచి రెండేళ్ల పాటు కేంద్రం పూర్తిగా ముఖం చాటేసింది. దీంతో, నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించు కోలేని పరిస్థితి ఏర్పడుతోంది. దేశలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతంగా గుర్తించబడిన విజయనగరం పార్లమెంట్ స్థానం పరిధిలో నాలుగేళ్లలో వచ్చిన రూ.7కోట్లు ఎలా సరిపోతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంతకు ముందు (16వ లోక్ సభ) నుంచి మిగిలివున్న రూ.5.65కోట్లను కూడా విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అభివృద్ధి పనులకు వినియోగించారు. దీన్ని సాకుగా చూపుతూ ఏటా రావాల్సి నిధులకు కన్నం పెట్టిందని కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. పాత, కొత్త నిధులు కలుపుకుని మొత్తంగా గడిచిన నాలుగేళ్లలో రూ.12.65 కోట్ల నిధులు ఉపయోగించగా, ఎలక్ట్రికల్ ఫోల్స్‌కు అత్యధికంగా ఖర్చుచేసినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మూడు అంబులెన్సులకు సుమారు రూ.90కోట్ల వరకు కేటాయించారు. మిగిలిన నిధులు పాఠశాల్లో మౌలిక సదుపాయాలకు, రోడ్లు, కాలువలు, కల్వర్లుకు ఖర్చు చేశారు. కరోనా నుంచి కోలుకున్న తరువాత కూడా నిధులు విడుదల చేయకపోవడం పట్ల జనం నుంచి తీవ్ర అసహనం వ్యక్తమౌతోంది.

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చడంపై

భగ్గుమన్న గిరిజనం

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని, అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి గిరిజన సంఘం, గిరిజన సంఘాల జెఎసి ఆధ్వర్యాన శుక్రవారం చేపట్టిన మన్యం బంద్ జిల్లాలో విజయవంతమైంది. దుకాణాలు మూతపడడం, వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో మన్యం బోసిపోయింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ పలుచోట్ల భారీ ర్యాలీలు నిర్వహించిన నిరసనలు తెలిపారు. పలు గ్రామాల్లోకి వాహనాలు రానీయకుండా రహదారి మధ్యలో కర్రలు అడ్డుపెట్టి నిరసన వ్యక్తం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంతో సహా అన్ని ఏజెన్సీ మండలాల్లో బంద్ సంపూర్ణంగా జరిగింది. ఈ బంద్‌కు సిపిఎం, టిడిపి, కాంగ్రెస్, వివిధ ప్రజాసంఘాలు మద్దతు తెలిపాయి. పలుచోట్ల అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కూడా బంద్‌లో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు.

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

గిరిజన సంఘాల జెఎసి, అఖిలపక్షం ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ర్యాలీలు, రాస్తారోకోలు చేశారు. అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ గిరిజన ద్రోహి అంటూ మండిపడ్డారు. బంద్ కారణంగా గుమ్మ లక్ష్మీపురం ఎల్విన్ పేట గ్రామాల్లో వస్త్ర వాణిజ్య సముదాయాలు హోటళ్లు ూతపడ్డాయి. బంద్‌కు ఎపి గిరిజన సంఘం, సిపిఎం, టిడిపి, కాంగ్రెస్ నాయకులు, యుటిఎఫ్, గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఎల్విన్‌పేట నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలక అవినాష్ మాట్లాడుతూ బోయ, వాల్మీకులను గిరిజన జాబితాలో విలీనం చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సాలూరు మన్యంలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఎపిగిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సీదరపు అప్పారావు, గిరిజన సంఘాల జెఎసి నాయకులు కొండగొర్రి ఉదయ్ కుమార్,మజ్జి నారాయణరావు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి ఆధ్వర్యాన గిరిజనులు స్థానిక బోసు బొమ్మ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. జియ్యమ్మవలస మండల కేంద్రంలో మన్యం బంద్ విజయవంతమైంది. కొమరాడ మండల కేంద్రంలో అంతరాష్ట్ర రహదారిపై ర్యాలీ చేపట్టారు. కురుపాంలో దుకాణాలన్నీ మూతపడ్డాయి. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, వ్యకాస జిల్లా ప్రధానకార్యదర్శి కె.గంగునాయుడు ఆధ్వర్యాన ర్యాలీ, మానవహారం చేశారు. తూర్పు ముఠా మొండెంఖల్, నీలకంఠాపురం గ్రామాల్లో వైసిపి గిరిజన ప్రజా పతినిధులు ఎ.మన్మధరావు, ఐ.గౌరీశంకర్ మన్యం బంద్‌లో పాల్గొన్నారు. పాలకొండ మండలంలోని సింగనవలస జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. సీతంపేట మండలంలో మన్యం బంద్ విజయవంతమైంది. షాపులన్నీ మూత పడ్డాయి. దోనుబాయి కూడలి వద్ద ఆందోళన చేశారు. పార్వతీపురం కాంప్లెక్స్ కూడలి నుండి ఐటిడిఎ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఐటిడిఎ కార్యాలయంలోని అడవి తల్లి విగ్రహానికి నాయకులు పాలాభిషేకం చేసి పూలదండ వేశారు. పాచిపెంట, భామిని, మక్కువ మండలాల్లో బంద్‌విజయవంతమైంది.



సాలూరు.. రోడ్డుపై బైఠాయించిన గిరిజనులు



గుమ్మలక్ష్మీపురం.. మన్యం బంద్‌తో మూతపడిన దుకాణాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రియుడితో కలిసి భర్తను హతమార్చి..

ప్రజాశక్తి-గంట్యాడ

తన భర్తను ప్రియుడితో కలిసి హతమార్చిన ఘటన గురువారం రాత్రి బుడతనాపల్లిలోచోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... బుడతనాపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీను (29) పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. వేపాడ మండలం సోంపురం గ్రామానికి చెందిన శ్రీను బుడతనాపల్లికి చెందిన సన్యాసమ్మను వివాహం చేసుకొని ఇల్లరికం వచ్చాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె వంట పనులకు వెళ్తుంటుంది. ఆ క్రమంలో బొండపల్లి మండలం ఒంపిల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో పరిచయమై అక్రమ సంబంధం ఉనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి శ్రీనును భార్య సన్యాసమ్మ, ఆమె ప్రియుడు కలిసి హతమార్చినట్లు తెలిసింది. శ్రీను తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, గంట్యాడ ఎస్ఐ కిరణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోర్డులు లేకుండా బిల్లులు

- పనులకు రాకుండా మస్టర్లు
- సామాజిక తనిఖీలో వెలుగులోకి..
- కొన్ని పంచాయతీల్లో తూతూ మంత్రంగానే
- అవకతవకలపై చెప్పని అధికారులు



పంచాయతీరాజ్ జెఇ రామకృష్ణారావును వివరణ అడుగుతున్న ఎపిడి

ప్రజాశక్తి-రేగిడి

ఉపాధి హామీ చట్టంలో చేపట్టిన పనుల వద్ద బోర్డులు లేకుండా బిల్లులు చెల్లింపులపై అక్రమాలు బయటపడ్డాయి. పనులకు రాకుండా మస్టర్లు వేసి అవకతవకలకు పాల్పడిన ఘటనలూ వెలుగు చూశాయి. ఈ మేరకు శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఎపిడి లక్ష్మణరావు, జిల్లా విజిలెన్స్ అధికారి రవీంద్ర కుమార్ హాజరయ్యారు. 39 పంచాయతీల్లో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు రూ.19 కోట్లతో చేపట్టిన 687 పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఖండ్యాం, కొమిరి, కోడిశ, అంబఖండి, కొర్లవలస, ఒప్పంగి, పారంపేట, మునకలవలస, పనసలవలస, పెద్ద శిర్లాం తదితర పంచాయతీల్లో కూలీలు పనులకు రాకుండా మూడు నుంచి ఐదు రోజుల వరకు మస్టర్లు వేయడం వంటి అక్రమాలు బయటపడ్డాయి.. పంచాయతీరాజ్ కు సంబంధించి సోమరాజుపేట గ్రామంలో బల్క్‌మిల్క్ కేంద్రాన్ని నిర్మాణం చేపట్టకుండా రూ.1.25 లక్షలు బిల్లులు డ్రా చేసినట్లు వెల్లడైంది. చిన్నశిర్లాంలో సిసి రోడ్డుకు రూ.1.25 లక్షలు డబుల్ పేమెంట్ అయినట్లు వెలుగులోకి వచ్చింది.. మునకలవలసలో సిసి రోడ్లు మూడు మంజూరయ్యాయని, వర్క్ ఆధారంగా సిమెంటు వాడకుండా ఇష్టానుసారం వ్యవహరించారని సామాజిక తనిఖీల్లో రుజువైంది. దీనిపై మండల జెఇ రామకృష్ణారావు సర్ది చెప్పుకున్నారు. మిగతా గ్రామ పంచాయతీలకు తూతూ మంత్రంగానే సాగింది. లెవెన్ ప్లాంటేషన్‌లో కొన్ని పంచాయతీల్లో మొక్కలు నాటినా వాటి సంరక్షణ లేక ఎక్కడా మొక్కలు లేవని తేలింది. ఈ సామాజిక తనిఖీల్లో ఎంత అవకతవకలకు పాల్పడ్డారో ఎస్ఆర్‌పి, ఎపిడి చెప్పకపోవడం విడ్డూరంగా ఉంది. ఆన్‌లైన్‌లో పొందుపరిచిన తర్వాతే తెలుస్తుందని సమాధానం ఇవ్వడం గమనార్హం.

15 రోజులుగా సామాజిక తనిఖీ

గత 15 రోజులుగా ఎస్ఆర్‌పి ఆధ్వర్యంలో డిఆర్‌పిల సమక్షంలో ఐదు బృందాలుగా గ్రామాలకు వెళ్లి పనులపై తనిఖీలు నిర్వహించారు. డిఆర్‌పిలుగా కె.కృష్ణ, కె.సత్తిబాబు, డి.సత్యరాజు వ్యవహరించారు. ఈ సామాజిక తనిఖీల్లో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహన్ రావు, మండల విప్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపిడిఒ జి.కాశీవిశ్వనాథరావు, ఎపిడి లక్ష్మీపతిరాజు, ఎపిఒ ఎస్.హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములపై దర్యాప్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

వేణుగోపాలస్వామి, సీతారామస్వామి ఆలయాల భూములపై దేవాదాయశాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం వేణుగోపాలస్వామి, గుల్లసీతారాంపురం సీతారామస్వామి ఆలయాల భూములకు సంబంధించి ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ అధికారులు భూరికార్డులను పరిశీలించారు. గుల్ల సీతారాంపురం ఆలయ పరిధిలో 18 గ్రామాల్లో 2,280.53 ఎకరాలు, బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయ పరిధిలో 18 గ్రామాల్లో 2,167.02 ఎకరాల భూమి ఉందని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.ఎల్.సుధారాణి, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌డిసి డి.భారతి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో ఆలయ భూములను గుర్తించి సరిహద్దులు వేయాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నట్లు చెప్పారు. సర్వే నంబర్ల వారీగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. బలిజిపేట మండలంలోని అజ్జాడలో 714.85 ఎకరాలు భూమి ఉంటే 473.19 భూములను గుర్తించామని, ఇప్పటికి 3.50 ఎకరాలకు మాత్రమే రైతుల నుంచి రూ.5 వేలు ఆదాయం వస్తుందని ఇఒ ప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కృష్ణకుమారి, సర్వేయర్లు ఎస్.రూపావతి, పిఎస్ఆర్ ఆచార్యులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎసి సుధారాణి, ఎస్‌డిసి భారతి

ఆటోల్లో స్పీకర్లు స్వాధీనం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా ఎస్‌పి ఆదేశాలతో ట్రాఫిక్ డిఎస్‌పి ఎల్.మోహనరావు ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద మోటారు వాహన చట్టం నిబంధనలు పాటించని ఆటోలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా డిఎస్‌పి మోహనరావు, ఎస్ఐ లోవరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం గా ఏర్పడి ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద తనిఖీలు చేపట్టారు.

నిబంధనలకు విరుద్ధంగా ఆటోల్లో స్పీకర్లు ఏర్పాటు చేసి, శబ్ద కాలుష్యం చేస్తూ, మిగతా వాహనదారులకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి, స్పీకర్లను తొలగించారు. ఆటో డ్రైవర్లు నిబంధనలు మేరకు నడుచుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ధర్నా చేస్తున్న ఉపాధి హామీ కూలీలు, వ్యకాస నాయకులు

'ఉపాధి'కి కేంద్రం తూట్లు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి-కొత్తవలస

ఉపాధి హామీ చట్టానికి బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద వ్యకాస ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ పని పాత పద్ధతిలోనే పెట్టాలని డిమాండ్ చేశారు. 200 రోజులు పని దినాలు కల్పించి, రూ.600 కూలి ఇవ్వాలని కోరారు. అనేక సంఘాలు పోరాడి సాధించి పెట్టిన ఉపాధి హామీ చట్టానికి బిజెపి, వైసిపి తూట్లు పొడుస్తున్నాయని విమర్శించారు. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయకుండా, కూలీలు తమంతట తాముగా పని మానేసేటట్లు నిబంధనలు అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టం వచ్చిన దగ్గర నుంచి మెటీరియల్ కాంపొనెంట్ నిధులు పెంచుకుంటూ, కూలీల పనులు తగ్గించుకుంటూ వస్తున్నాయని దుయ్యబట్టారు. రెండు పూటలా పని పెట్టి ఎండలో మగ్గించి ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని మండిపడ్డారు. క్యూబిక్ మీటర్‌కి రూ.300లోపు మాత్రమే వేతనం ఇస్తున్నారన్నారు. పనిప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. మోడీ, జగన్ ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్ల జగన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బి.సుందరమ్మ, బి.నాగేశ్వరరావు, చిన్నమ్మలు, పూడి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

'వ్రిందా'తో సెంచూరియన్ ఒప్పందం

నెల్లిమర్ల : విశాఖలోని వ్రిందా ఆస్పత్రితో సెంచూరియన్ యూనివర్శిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ పుట్రేవు వంశీధర్‌తో యూనివర్శిటీ విసి జిఎస్ఎన్ రాజు మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం జరిగింది. కార్యక్రమంలో వ్రిందా ఆపరేషనల్ హెడ్ పావని, అనస్తీసియాలజిస్ట్ ఊహ, రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, పారామెడికల్ డీన్ ఎం.లక్ష్మీనరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

డిఎంహెచ్ఒ రమణకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రమణ కుమారి స్పష్టం చేశారు. శుక్రవారం తన ఛాంబర్‌లో జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించవలసిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు, ఆడపిల్ల పుట్టుకలు తక్కువగా నున్న మండలాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ప్రొగ్రాం అధికారులకు స్కానింగ్ సెంటర్‌లను విధిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి స్కానింగ్ సెంటర్ లో టారిఫ్ బోర్డులను ప్రదర్శించాలని ఆదేశించారు. పిసిపిఎన్‌డిటి చట్టంపై సహేలి, సఖి గ్రూపుల ద్వారా ప్రజలలో విస్తత ప్రచారం చేయాలని తెలిపారు. సంతానోత్పత్తి కోసం ఏ ఆసుపత్రి వారు అయిన నమోదు చేసుకోకుండా ఎఆర్‌టి పరీక్షలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ , జిల్లా టీకా అధికారి, ఘోష ఆసుపత్రి నుంచి జిల్లా స్త్రీ వైద్య నిపుణులు, పిల్లల వైద్యనిపుణులు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుండి రేడియోలాజిస్ట్, తదితరులు పాల్గొన్నారు.

ముఠా కళాసీలకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఠా కళాసీలకు సమగ్ర చట్టం చేసి రిటైర్ అయ్యాక పెన్షన్ స్కీమ్ ఏర్పాటు చేయాలని ముఠా కళాసీ సంఘం గౌరవాధ్యక్షుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసంఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం విజయనగరం దాబాతోట కళాసీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక ,ప్రజా,రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందన్నారు. కార్మిక హక్కులు కాలరాస్తోందన్నారు. దేశ సంపదను, అదాని, అంబానీలకు కట్టబెట్టి దోపిడీ చేస్తున్నారన్నారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని,దేశీయ పరిశ్రమలను పెట్టుబడి దార్లకు కట్టబెట్టి లూటీ చేస్తున్నారన్నారు. అందులో బాగంగా రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, విశాఖ స్టీల్ ప్లాంట్ అదాని,అంబానీలకు ఇచ్చేస్తున్నారని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.రమణ, ముఠా కళాసీలు, కార్మికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ముఠా కళాసీలు, సిఐటియు నాయకులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో రూ.46.10 లక్షలతో చేపట్టనున్న పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. శుక్రవారం స్థానిక 32,37 డివిజన్‌లలో రహదారులు, కాలువలు వంటి మౌలిక సదుపాయాల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జోనల్ ఇంచార్జ్ డాక్టర్ వి.ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఆదర్శ డివిజన్లుగా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ప్రధానంగా 37 వ డివిజన్లో సమస్యలు లేని డివిజన్ గా రూపుదిద్దారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్క పనిని నెరవేరుస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. చేపట్టబోయే పనులకు శంకుస్థాపన చేస్తూ, పూర్తయిన పనులను ప్రారంభోత్సవాలు చేస్తూ నగరంలో కొత్త ఒరవడికి తెరతీసారన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, 32, 37వ డివిజన్ కార్పొరేటర్లు భోగాపురం లక్ష్మి, కడియాల రామకృష్ణ, జోనల్ ఇన్‌ఛార్జులు భోగాపురం రవిచంద్ర, బొద్దాన అప్పారావు, ఎం.రాధారాణి తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

శ్యామసుందర్రావుకు కీర్తి పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ప్రతి ఏటా జాతీయస్థాయిలో లబ్ద ప్రతిష్టులైన కళాకారులను ఎంపిక చేసి అవార్డులను అందిస్తోంది. శుక్రవారం ఆ యూనివర్శిటీలోని ఎన్‌టిఆర్ కళా ప్రాంగణంలో అవార్డుల వేడుక జరిగింది. ఇంద్రజాల రంగంలోప్రతిష్టాత్మకమైన కీర్తి పురస్కార్ అవార్డును విజయనగరానికి చెందిన చల్వపిల్ల. శ్యామసుందర్రావు అందుకున్నారు. విసి తంగడ కిషన్ రావు, యూనివర్సిటీ రిజిస్టార్. రవి, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ అధ్యక్షుడు అయాచితం శ్రీధర్ ఈ అవార్డును బహుకరించారు.



పురస్కారంతో శ్యామసుందర్

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈ నెల ఐదో తేదిన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు కోరారు. ఈ మేరకు పట్టణంలో ఆటో కార్మికులతో శుక్రవారం సమావేశమై, ప్రచారం చేపట్టారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం మోటార్ వాహనాల చట్ట సవరణ ద్వారా రవాణా రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేలా నిర్ణయాలు చేసిందని విమర్శించారు. ఇన్స్యూరెన్స్ ప్రీమియం పెంచి ఆటో రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసిందన్నారు.

రుణ విముక్తుల్ని చేయడానికే ఆసరా

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పూసపాటిరేగ

మహిళలను రుణ విముక్తుల్ని చేయడానికే సిఎం జగన్.. వైఎస్ఆర్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. పూసపాటిరేగ మండలానికి ఆసరా లబ్ధి రూ.12.33 కోట్లని తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమీపంలోని లేఅవుట్‌లో మూడో విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం జరిగింది. మండలంలో ఉన్న 1575 సంఘాలకు ఆసరా చెక్కులను అందజేశారు. మహిళలంతా కలిసి సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అక్కచెల్లెమ్మలకు పొదుపు సంఘాల బ్యాంకు రుణాల మొత్తం సొమ్మును నాలుగు దఫాలుగా చెల్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి మహంతి కళ్యాణి, జెడ్‌పిటిసి సీతాలక్ష్మి, వైస్ ఎంపిపిలు అల్లాడ రమేష్, చంటిరాజు, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, నాయకులు మహంతి శ్రీనివాసరావు, బొప్పాల లక్ష్మీనారాయణ, మహంతి జనార్ధన్‌రావు, సర్పంచ్ టొంపల సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కులను లబ్ధిదారులకు వారు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా మూడో విడతలో మండలంలోని 988 స్వయం సహాయక సంఘాల్లోని 10,490 మంది మహిళలకు రూ.5 కోట్లను అందిస్తున్నట్లు చెప్పారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు అనేక హామీలు ఇచ్చి మోసం చేశారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, ఎంపిడిఒ రమామణి, ఎపిఎం జి.వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ.. నమూనా చెక్కు అందిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి, ఎమ్మెల్యే బడ్డుకొండ

వికలాంగులకు సమగ్ర శిక్ష ద్వారా మంజూరైన ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలతోపాటు వైఎస్ఆర్ కంటివెలుగు ద్వారా 116 మంది విద్యార్థులకు మంజూరైన కళ్లద్దాలను భవిత కేంద్రంలో ఎమ్‌పి బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ సూర్యారావు, ఎంఇఒ తిరుమల ప్రసాద్, ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, ఐఇఆర్‌పి అచ్యుతరావు పాల్గొన్నారు.

గరివిడి : చీపురుపల్లి ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో మూడో విడత ఆసరా చెక్కులను జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 14,727 మంది ఆసరా లబ్ధిదారులకు రూ.11.54 కోట్లను అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు కెవి సూర్యనారాయణరాజు, ఎంపిపి ఇప్పిలి వెంకట నరసమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, నాయకులు ఇప్పిలి అనంత్, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఎఎంసి చైర్మన్ దన్నాన జనార్ధన్, బెల్లాన వంశీకృష్ణ, ఇప్పిలి గోవింద పాల్గొన్నారు.

ఘనంగా సాంకేతిక ఉత్సవం

ప్రజాశక్తి-గరివిడి

అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఘనంగా జరిగిన జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవం జరిగింది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. జాషువ జయప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎయు మెకానికల్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఎస్.ఎస్.సుమన్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం సామాన్యులకు చేరువ కావాలని, ఆ దిశగా ఇంజినీరింగ్ విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు ఆలోచించాలని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న అంతర్గత నైపుణ్యాలను, సాంకేతిక నైపుణ్యాలను, నాయకత్వ లక్షణాలను వెలికి తీయటానికి ఇటువంటి సాంకేతిక ఉత్సవాలు దోహదం చేస్తాయని తెలిపారు. గౌరవ అతిథిగా హాజరైన జిఎంఆర్‌ఐటి ప్రొఫెసర్ డాక్టర్ పి.రమణ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికపరమైన అంశాల పట్ల సజనాత్మక పెంపొందించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్ పో, క్విజ్ వంటి తదితర సాంకేతిక ప్రతిభ పరీక్షలను నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకట రమణ, ఎం జి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వసతి గృహం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సామాజిక సేవ కార్యక్రమాలలో సమిష్టి భాగస్వామ్యం అవసరమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. శుక్రవారం 19వ డివిజన్లో ఆది ఆంధ్ర పాఠశాల పక్కన ఏర్పాటు చేసిన వసతి గృహాన్ని ఆయన ప్రారంభించారు. వాస్తవానికి బాలుర వసతి గృహం గతంలో కంటోన్మెంట్ పాఠశాల ఆవరణలో ఉండేది. భవనం శిథిలావస్థకు చేరడంతో గత నిర్వహకులు వసతి గృహం నిర్వహణ బాధ్యతలు నుండి తప్పుకున్నారు. దీంతో జై శ్రీ గ్రంథాలయ సంస్థ అనే స్వచ్ఛంద సంస్థ వసతి గృహ నిర్వహణకు ముందుకు వచ్చింది. ఈనేపథ్యంలో మౌలిక సదుపాయాలు కల్పన వంటి పరిస్థితులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహానికి అవసరమైన 70 పరుపులు, పది ఫ్యాన్లు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతి దేవి, స్థానిక కార్పొరేటర్ పొట్నూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

5 నుంచి సీతంలో 'హ్యాకథాన్'

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఏప్రిల్ 5 నుంచి 8వ తేదీ వరకు హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డివి రామమూర్తి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ విజయనగరం అనే ముఖ్యాంశం తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీనికి కన్వీనర్‌గా ప్రొఫెసర్ వేణుమాధవ్ వ్యవహరిస్తారని చెప్పారు. జెఎన్‌టియు - జివి వైస్ ఛాన్సలర్ వెంకటసుబ్బయ్య ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో కంప్యూటర్ సైన్సు హెచ్‌ఒడి జి.వేణుమాధవ్, స్టూడెంట్ కోర్డినేటర్ ఎ.రేణుక పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో పంటకు అధిక పోషకాలు

ప్రజాశక్తి-కొత్తవలస

ప్రతి రైతు నవధాన్యాలు సాగు వైపు మొగ్గుచూపి భూమిని సారవంతమైన నేలగా తయారు చేయడానికి సిద్ధం కావాలని జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు, తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు అన్నారు. తుమ్మికాపల్లి గ్రామంలో నవధాన్యాలు సాగుపై విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయాలని, ప్రస్తుతం భూమిలో పోషకాలు తక్కువ ఉన్నాయని తెలిపారు. పంటకు సరిపడే కార్బన్ శాతం భూమిలో లేదన్నారు. కార్బన్ శాతం పెరగాలంటే ప్రతి రైతు నవధాన్యాల సాగువైపు మారాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగు ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ సమావేశంలో రీజనల్ టీచర్ టి.ప్రకాశ్ పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా జ్ఞానేశ్వరరావు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

లక్కవరపుకోట ఎంపిడిఒ కె.రూపేష్ శిక్షణ నిమిత్తం బాపట్ల వెళ్లడంతో ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా ఇఒపిఆర్‌డి జి.జ్ఞానేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపిడిఒ రూపేష్ ఆరు నెలల శిక్షణ కాలం ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు ఉంది. అంతవరకు జ్ఞానేశ్వరావు ఎంపిడిఒగా కొనసాగుతారని కార్యాలయ సూపరింటెండెంట్ ఎంవిఎ దొర తెలిపారు.

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చొద్దు

ప్రజాశక్తి-వంగర

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చవద్దని ఆదివాసీ హక్కుల సాధన జెఎసి నాయకులు గుడివాడ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ డి.ఐజాక్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కోమటిపల్లిలో గడపగడపకు..

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని కోమటిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆధ్వర్యాన శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, ఎంపిపి సింహాద్రి అప్పలనాయుడు, మంత్రి అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు కడుబండి రమేష్‌నాయుడు, వైస్ ఎంపిపిలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎయిమ్స్ విద్యాసంస్థల అధినేత కడగల ఆనంద్ కుమార్ అన్నారు. శుక్రవారం ఉషోదయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరజాపుపేట జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా పరీక్షా కిట్లు పంపిణీ చేశారు. ఫలితాల్లో ఎ-గ్రేడ్ సాధించిన వారందరికీ 20వేల రూపాయలు ప్రోత్సాహక బహుమతి ఇస్తానని ఆయన ప్రకటించారు. పాఠశాల రక్షణకు సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉషోదయ యూత్ అసోసియేన్ ప్రతినిధి, మిమ్స్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ ఆరిపాక శ్రీనివాసరావు, మద్దిల ప్రసాద్, నామాల తిరుపతిరావు, వ్యాపారవేత్తలు మణ్యపురి మోహనరావు, తుమ్ము వెంకట రమణ, హెచ్‌ఎం రాజేష్ పాల్గొన్నారు.


పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఎన్‌కెఆర్‌పురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ఘనవీడ్కోలు పలికారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని హెచ్‌ఎం ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెటర్నరీ మందులషాపు ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ



మందుల షాపును ప్రారంభిస్తున్న ఎంపిపి సత్యవంతుడు

వేపాడలో వావిలపాడుకు చెందిన బొడ్డు తాతంనాయుడు కొత్తగా ఏర్పాటు చేసిన వెటర్నరీ మందులషాపును శుక్రవారం ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు ప్రారంభించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ సింహాద్రినాయుడు, వల్లంపూడి ఉప సర్పంచ్ రుద్ర వెంకటరావు, నాయకులు బీల సతీష్, నిరుజోగి శ్రీను, బొడ్డు శ్రీను, కొయినాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వితరణ

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇఐడి ప్యారీ సుగర్స్ యాజమాన్యం పరీక్ష కిట్లు అందజేసింది. సర్పంచ్ బుడుమూరు పట్టాభి, మండల మజ్జి శ్రీనివాస రావు శుక్రవారం వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫకీర్, సుగర్‌కేన్ జిఎం రమేష్ కుమార్ రెడ్డి, సీనియర్ మేనేజర్ కిల్లి అప్పారావు , హెచ్‌ఆర్ మేనేజర్ పాల్గొన్నారు.

భారీ అన్నదానం

ప్రజాశకి-విజయనగరం టౌన్

విజయనగరం మండలం పినవేమలిలో సీతారామ కళ్యాణం పురస్కరించుకుని శుక్రవారం భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పొట్నూరు వెంకట సాయి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 2వేల మందికి అన్నదానం చేశారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు సైలాడ గోవిందరావు, పడాల సత్యనారాయణ, అప్పారావు, పడాల రమణ, మసాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశంలో రసాభాస

టిడిపి, వైసిపి కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం

ప్రజాశక్తి-బొబ్బిలి



వాగ్వివాదానికి దిగిన కౌన్సిలర్లు

ప్రజా సమస్యలపై చర్చించాల్సిన కౌన్సిల్ సమావేశం రాజకీయ వాదనలకు కేరాఫ్‌గా మారుతోంది. ప్రజా సమస్యలపై చర్చ లేకుండానే వాగ్వివాదాలు చేసుకుని ముగించడంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభంలో టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్ రాంబార్కి శరత్ మాట్లాడుతూ మున్సిపల్ చరిత్రలో కౌన్సిల్ సమావేశం జరపని నెల లేదని, గత నెల ఎందుకు కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదని ప్రశ్నించారు. అజెండా పూర్తయ్యాక చర్చించుకుందామని చైర్మన్ సావు మురళి అనగా ముందే చర్చ పెట్టాలని టిడిపి కౌన్సిలర్లు పట్టు పట్టారు. దీంతో వైసిపి కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, ఎస్.రామకృష్ణబాబు, పి.ఉమాశంకర్ కలుగజేసుకున్నారు. దీంతో ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. కొంతసేపటి తర్వాత అజెండాపై చర్చ మొదలైంది. తమ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభించలేదని ఆరో వార్డు కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావు అన్నారు. పట్టణ సుందరీకరణకు నాటిన మొక్కల సంరక్షణకు మున్సిపల్ నిధులు ఎక్కువ ఖర్చు చేస్తున్నా, అందుకనుగుణంగా పనులు చేయడం లేదని వైసిపి కౌన్సిలర్ ఇంటి గోవిందరావు, టిడిపి కౌన్సిలర్ శరత్ అన్నారు. గొల్లపల్లిలో సామూహిక మరుగుదొడ్లు పనిచేయడం లేదని, బాగు చేయాలని పదో వార్డు కౌన్సిలర్ కాకల గోవిందమ్మ కోరారు. వీధి దీపాలు వెలగడం లేదని పలువురు కౌన్సిలర్లు అన్నారు. కౌన్సిల్ సమావేశంలో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని చైర్మన్ మురళి హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో గతనెల కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర ఆహార అలవాట్లు అలవర్చుకోవాలి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్‌జెడి చిన్మయిదేవి



మాట్లాడుతున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్‌జెడి చిన్మయిదేవి

ప్రజాశక్తి-దత్తి రాజేరు

గర్భిణులు, బాలింతలు ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్‌జెడి చిన్మయిదేవి సూచించారు. పోషణ్ పక్వాడా వేడుకల్లో భాగంగా పెదమానాపురంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆర్‌జెడితోపాటు జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ పోషకాహారం ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడంతోపాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడమే పోషణ్ పక్వాడా లక్ష్యమన్నారు. పోషకాహార లోపం లేకుండా చిరుధాన్యాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. అందుకోసమే 2023ను అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వ అందజేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొటివాడ దాసు, పిఒ నాగమణి, ఉప సర్పంచ్ గురుబిల్లి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ కోసం 'ఆంధ్ర' నిర్వాసితుల ధర్నా


ప్రజాశక్తి- మెంటాడ

ఆంధ్ర ప్రాజెక్టు నిర్వాసితులకు చేపల సొసైటీ ఏర్పాటు చేయాలని ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయానికి వచ్చిన బొబ్బిలి ఆర్‌డిఒ శేషశైలజను కలిసిన గిరిజనులు తమ సమస్యలను మొరపెట్టుకున్నారు. గిరిజన గ్రామాలకు రోడ్డు సదుపాయాలు కల్పించాలని, గురుగుబిల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల చేసి పనులు వేగవంతం చేయాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి తామరాపల్లి సోములు, కౌలు రైతుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. గిరిజనులు సాగుచేస్తున్న పోడు భూములు, రిజర్వ్ ఫారెస్ట్ భూములకు పట్టాలివ్వాలని కోరారు. అనంతరం ఆర్‌డిఒకు వినతి అందించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చిలక సన్యాసిరావు, సిహెచ్ సత్యం, ఎస్.వీరయ్య, జి.అప్పలనాయుడు, ఎస్.గంగరాజు, టి.దాలయ్య, డి.కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒతో మాట్లాడుతున్న రాకోటి రాములు

న్యాయవాదుల సంఘం కార్యవర్గం ఎన్నిక



న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. జిల్లా కోర్టులో జరిగిన ఈ పోలింగ్‌లో 525 మందికి గాను 466 మంది న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షులుగా సిహెచ్ దామోదర రామ్మోహనరావు 397 ఓట్లు సాధించి విజేతగా నిలిచారు. సంయుక్త కార్యదర్శిగా పీటర్ మార్టిన్, క్రీడలు, సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా పి.కుమారస్వామి ఎన్నికయ్యారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ రెండు పోస్టులకు నలుగురు పోటీ పడగా జి.రాంబాబు, కెఎస్ భవాని ఎన్నికయ్యారు. మహిళా ప్రతినిధి పదవికి జి.రాజరాజేశ్వరి విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా ఎఎన్‌వి అంజనీకుమార్, కార్యదర్శిగా విజి సంతోష్, కోశాధికారిగా కెసిఆర్ నాయుడు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పి.రమేస్, ఎస్.సుబ్రహ్మణ్యం, ఎస్.హరిమోహన్, గ్రంథాలయ కార్యదర్శిగా మీసాల మురళీ, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా పి.శ్రీరామ్మూర్తి, రెడ్డి రామకృష్ణ, పివి వరలక్ష్మి వ్యవహరించారు. ఎన్నికైన నాయకులను న్యాయవాదులంతా అభినందించారు.

గజపతినగరం : గజపతినగరం కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. స్థానిక కోర్టు ఆవరణలో జరిగిన ఎన్నికల్లో నూతన అధ్యక్షులుగా పోలిపల్లి ఆదినారాయణ, కార్యదర్శిగా తొత్తడి దేముడుబాబు, కోశాధికారిగా లెంక రాంబాబు, సహాయ కార్యదర్శిగా నాలం రాంప్రసాదరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'వైసిపి నాయకుల తీరు సిగ్గుచేటు'

ప్రజాశక్తి-బాడంగి

ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు తీరు సిగ్గుచేటని టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, వైస్ ఎంపిపి సింగిరెడ్డి భాస్కరరావు, ఎంపిటిసి సభ్యులు పాలవలస గౌరు, కొల్లి అప్పలనాయుడు ఆక్షేపించారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైకెపి అధికారులపై వైసిపి నాయకులు పెత్తనం చెలాయిస్తున్నారని చెప్పారు. 'ఆసరా' సభలో సంబంధం లేని మాటలు ఆడటం ఎంతవరకు సమంజసమని, కనీసం వేదికపై కూర్చున్న పెద్దలు ఖండించకపోవడం దారుణమని పేర్కొన్నారు. గొల్లాది బ్రిడ్జి తమ ప్రభుత్వ చివరి సమయంలో మంజూరైందని, ఎన్నికలు రావడంతో చేపట్టలేకపోయామని తెలిపారు. ఆ విషయాన్ని వదిలేసి, గతంలో ఉన్న నాయకుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు నిర్వహించిన సభలో వ్యక్తిగత విమర్శలు చేయడమేమిటని ప్రశ్నించారు. ఎంపిడిఒ కార్యాలయాన్ని వైసిపి ఆఫీసుగా మార్చేశారని చెప్పారు. అనధికారికంగా కార్యాలయంలో పనులను చక్కబెడుతున్నారని ఆరోపించారు. ఆసరా సభకు మహిళలను తరలించి, కనీస వసతులు కల్పించలేదన్నారు. ఇదేమిటని అడిగితే ఉపాధి పనులు ఒంటిగంట వరకు చేయిస్తామంటూ బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉండే మండలంలో ఇటువంటి సంస్కృతిని ఎన్నడూ చూడలేదన్నారు. వైసిపి నాయకుల అరాచకాలు, నియంతృత్వ పోకడలను జనాలు గమనిస్తూనే ఉన్నారని, త్వరలోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

యువతి ఆత్మహత్య కేసులో యువకుడికి రిమాండ్

ప్రజాశక్తి - జామి

భీమసింగి పంచాయతీ కొత్త భీమసింగి గ్రామానికి చెందిన జగదీశ్వరి ఆత్మహత్య కేసులో నిందితుడు చిన్ని కోటిబాబుకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ, శంగవరపుకోట న్యాయ స్థానం ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 10న భీమసింగి రైల్వే ట్రాక్ పై యువతి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. స్థానిక సెల్ ఫోన్ షాపు నిర్వాహకుడు వేధింపులు వల్లే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే తొలుత రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. అనంతరం కేసు స్థానిక పోలీసులకు బదిలీ చేయడంతో ఎస్ఐ వీరబాబు కేసును చేధించి, నిందితుడు కోటిబాబును అరెస్టు చేశారు. న్యాయస్థానం కోటిబాబుకు 14 రోజులు రిమాండ్ విధించింది.

దొంగనోట్ల చలామణి కేసులో ఆరుగురికి శిక్ష

బొబ్బిలి : సాలూరు పట్టణంలో దొంగనోట్ల చెలామణి కేసులో ఆరుగురు ముద్దాయిలకు శిక్ష విధిస్తూ బొబ్బిలి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు తీర్పు ఇచ్చింది. 2010లో జరిగిన ఈ ఘటనలో ఏడుగురు ముద్దాయిల్లో బంగారమ్మపేటకు చెందిన కంటు వెంకటమ్మ మృతి చెందారు. మిగిలిన ఆరుగురికి శిక్షలు ఖరాయయ్యాయని సాలూరు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. బంగారమ్మపేటకు చెందిన బూరాడ సూర్యనారాయణ పదేళ్ల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా, గురమ్మకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా, చంద్రమ్మకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.రెండు వేల జరిమానా విధించినట్లు చెప్పారు. భోగాపురానికి చెందిన చల్లా నూకరెడ్డికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా, విశాఖపట్నానికి చెందిన కె.శ్రీనివాసరావు, సత్తుపల్లికి చెందిన దాసరి సత్యనారాయణకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

మార్కెట్ రుసుం వసూళ్లలో భేష్

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపండి : మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



సమీక్షలో మార్కెటింగ్ శాఖ కమిషనర్, అధికారులు

మార్కెట్ యార్డుల్లో లక్ష్యాన్ని మించి రుసుం వసూళ్ల పట్ల మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ పనులు, కొత్త నిర్మాణాలకు సంబంధించి వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా తొలుత మార్కెటింగ్ శాఖ ఎడి కార్యాలయంలో శాఖ పరమైన కార్యకలాపాలపై సమీక్షించారు. అనంతరం ఆర్‌అండ్‌బి రైతుబజార్‌ను, నెల్లిమర్ల మండలం గుషిణిలోని మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ పనులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.10కోట్ల మార్కెటింగ్ రుసుముకు గాను రూ.12కోట్లు వసూలు చేయడం అభినందనీయమన్నారు. వసూళ్లలో మార్కెటింగ్ ఎడి, కార్యదర్శులు, సిబ్బంది మంచి కృషిచేశారన్నారు. మార్కెట్ కమిటీ గొడౌన్లను గుర్తించి, మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అవసర మైన చోట కొత్త గొడౌన్లను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆర్‌అండ్‌బి రైతు బజార్ కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ ఉండడం వల్ల పనులు నిలిచిపోయాయని అధికారులు తెలియజేశారు. నిధులు వెంటనే మంజూరు చేస్తామని, పనులు పునప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఫేజ్-1లోవున్న 37 ఎంపిఎస్‌సి గొడౌన్లను పూర్తిచేయాలని డిఇ కోటయ్యను ఆదేశించారు. మొదవలస మార్కెట్ యార్డు నిర్మాణ పనులను త్వరిత గతీన పూర్తిచేయాలని సూచించారు. ప్రహరీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఎడి శ్యామ్‌కుమార్ శాఖ పరమైన కార్యక్రమాలు, రైతు బజార్ల పనితీరు తదితరాలను వివరించారు. ఈ ఏడాది సివిల్ సప్లయ్ బాకాయి సకాలంలో విడుదల కావడంతో లక్ష్యానికి మించి రుసుము వసూలు చేయగలిగామని అన్నారు. పర్యటనలో జెడి పి.సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ ఎర్రన్న, మార్కెట్ యార్డుల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కరాటే పోటీలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట



కరాటే పోటీల్లో విజేతలతో వైసిపి నాయకులు తూర్పాటి వెంకటరామకృష్ణ

శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని గొల్జాంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాముల వారి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారీ అన్నదానం చేశారు. శుక్రవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సిఐఎస్‌ఎఫ్ ఉద్యోగి మచ్చకర్ల వెంకటరావు ఆధ్వర్యంలో పరుగు పందేలు నిర్వహించారు. ఈ పోటీలో 120 మంది పాల్గొనగా వారిలో ఆరుగురిని విజేతలుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కరాటే పోటీలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సీనియర్ కరాటే శిక్షకులు పి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో బి. రిషేంద్రకుమార్ , షేక్ తనీష , జె మనోహర్ , జి శశికుమార్ , ఎన్ భరత్ తదితరులు మొదటి స్థానంలో నిలవగా బి.ప్రతాప్ కుమార్ , జె.దీక్షిత , జి.జస్వంత్ , పి.వరుణ్ సందీప్ , ఎం.గణేష్ రెండవ స్థానం కైవసం చేసుకున్నారు. విజేతలకు వైసిపి సీనియర్ నాయకులు తూర్పాటి వెంకటరామకృష్ణ బహుమతులు అందజేశారు. కరాటే క్రీడలు అత్యవసర సమయంలో ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం తప్పనిసరిగా కలుగుతు ఒదన్నారు. ఈ సందర్భంగా తూర్పాటి వెంకటరామకృష్ణను సత్కరించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణీతగా విక్టరీ షూటోకాన్ కరాటే అసోసియేషన్ విశాఖ సీనియర్ కోచ్ టి సాయికుమార్ వ్యవహరించారు.

స్పందించారు.. పనితీరు మార్చారు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం జంక్షన్ నుంచి వేపాడ మీదుగా ఆనందపురం కూడలి వరకు చేపడుతున్న రోడ్డు పనుల్లో నాణ్యత లోపాలపై 'ప్రజాశక్తి'లో 'నెలకే బీటలు' అనే శీర్షికతో శుక్రవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాల మేరకు రోడ్డు పనులు చేపడుతున్న కాంట్రాక్టరు తీరు మారింది. పాత తారురోడ్డును తవ్వకుండా కొత్తగా రోడ్డు వేయడంతో బీటలు వారుతోంది. అధికారుల ఆదేశాలతో కాంట్రాక్టరు పాత తారురోడ్డును పొక్లెయినర్‌తో తవ్వించి, రోలర్‌తో చదును చేసి, కొత్తగా రోడ్డు వేయించడం ప్రారంభించారు.



పాత రహదారిని తొలగిస్తున్న పొక్లెయినర్

కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గరివిడి

మండలంలోని తొండ్రంగి గ్రామంలో కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి మాజీ ఎమ్‌పి బొత్స ఝాన్సీలక్ష్మి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మీసాల విశ్వేశ్వరరావు, జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, సర్పంచ్ పి.అప్పలనాయుడు, ఎంపిటిసి జమ్మూ సతీష్, మాజీ ఎంపిపి కొణిసి కృష్ణంనాయుడు, కన్వీనర్ జి.కన్నారావు, పాపారావు, వెదుళ్లవలస సర్పంచ్ జి.తమ్మినాయుడు, మందిరివలస ఎంపిటిసి వై.పోలీస్‌నాయుడు, నాయకులు పాల్గొన్నారు.